
# ఓడిపోయిన మానవుడు

ఆర్. సీతారామారావు



ఖంగు - ఖంగు' మని సుమిత్ర బాధగా దగ్గింది. ఆ దగ్గు రెండు నిముషాల సేపు అలాగే వుంది.

ఎడతెరిపిలేని తుఫానులా — పిచ్చివాడి నవ్వులా — మృత్యుదేవత వికటాట్టహాసంలా ధ్వనించింది సుందరానికి ఆ దగ్గు !

'సుమిత్రా !' గొంతు పెగిలించి సుందరానికి పిలుస్తున్నప్పుడు

లోతుకు పోయిన ఆమె కళ్ళు — అతను కూర్చున్న వైపు తిరిగి నిర్లిప్తంగా చూసాయి.

'నీవు బ్రతుకుతావు సుమిత్రా ! నాకా ఆశ వుంది' కళ్ళలోంచి రెండు కన్నీటి బొట్లురాలి ఆమె పాలిపోయిన ముఖం మీద పడ్డాయి సుందరం ఆమెను గూర్చి మనసులో అనుకున్నప్పుడు — టప్ టప్‌న రాలిన భర్త కన్నీటి చుక్కలు ఆమెలో కొంచెం చలనాన్ని కలిగించాయి పేలవంగా నవ్వింది ఆమె !

సుందరం ఆమె పాలిపోయిన చెక్కిళ్లను నిమురుతూ 'నాకా ఆశ వుంది !' అని మనసులో అనుకుంటున్నట్లుగా గొణుక్కున్నాడు

— బయట భయంకరంగా చీకటి ! చీకటిలా అతని హృదయంలో పేరుకుపోయిన నిరాశ ! భగవంతుణ్ణి మనసులో ధ్యానం చేసుకున్నాడు :

'ప్రీ ! భగవాన్ .... ఈమె ప్రాణాన్ని యిచ్చేయ్. కావాలంటే నాది తీసుకో !' అని కూడా అనుకున్నాడు భగవంతుడు విన్నాడో లేదోగాని, పెద్దగా గాలి వచ్చి కిటికి రెక్కలు టపటపా కొట్టుకున్నాయి !

'టంగ్ .. టంగ్' మని గోడ గడియారం గంటలు కొట్టింది. లెక్క పెట్టాడు ! పది ! డాక్టర్ రావాల్సిన సమయం — ప్రతిరోజూ వేళ మించకుండా వచ్చే డాక్టరు ఈరోజు రాకుండా మానడు ! పొడిచి పొడిచి వున్న ఆమె శరీరంలోకి మళ్ళీ మందులను యింజక్‌న్ ద్వారా గుప్పించకా మానడు !

కానీ ఎన్నాళ్ళిలా ?

అతని గుండెల్లో వేయి మణుగుల బరువు — సుమిత్ర అతనికి తప్పించుకోరాని బరువు ! — ఆ బరువును ఆనందంగా మోద్దామనుకున్నాడు హృదయం నిండా ఆనందాన్ని నింపుకొని — అప్పుడు — ఆరోజును ఆహ్వానించాడు జీవితం అంతా వడ్డించిన విస్తరిలా కనబడింది ఎవరో కవి అన్నట్టు వడ్డించిన విస్తరికాదుకదా! పరిస్థితులనే కుక్కలు చింపిన విస్తరయింది బ్రతుకు మీద మోహం కలుగకముందే విరక్తి జనించింది ఇంక ఈ సముద్రాన్ని ఈదలేడు !

పూర్తిగా ఎదురు దెబ్బలు తిన్న తను ఈ కష్టాల కెరటాల ధాటికి తట్టుకోలేడు ! — ' నా బ్రతుకు ఇలా కావటానికి వీల్లేదు — వీల్లేదు ! ' అతను జుట్టులోకి రెండు చేతులనూ పోనిచ్చి దుఃఖంతో నిండిన కసితో అనుకున్నాడు

— ఆ మాట ఈ రెండు నెలల నుంచీ చాలాసార్లు అనుకున్నాడు

' సుమిత్రా ! ' జాలిగా పిల్చాడు.

'ఊఁ ! '

' ఇదిగో మందు ' ఔన్సు గ్లాసులో మందుపోసి ఆమెను పదిలంగా తన హృదయానికి అన్చుకొని మందు త్రాగించాడు

' డాక్టర్ రాలేదా ? ' నూతిలోంచి వచ్చిన శబ్దంలా కీచుగా ఆమె మాట

' లేదు వస్తాడులే, నీవు హాయిగా పండుకో '

' హాయి ' ఏదో చెప్పబోయి, దగ్గుతెర అడ్డం వచ్చి మాటరాక, చేతిని గాలిలోవూపింది

' నీకు మాట్లాడొద్దని ఎన్నిసార్లు చెప్పాను నామాట వినిపించుకోవుగా నీకు మొదట్నించీ అదొక రోగం ' అతనికి కోపం అనుకోకుండా వచ్చి గబగబా అనేశాడు ఆ మాటలలో విసుగు, — అలసట — అసహాయత అన్నీ ధ్వనించాయి !

అతని మాటలకు ఎండిపోయిన ఆమె నేత్రాలలోకి నీరు ఉబికింది మెల్లగా కన్నీళ్ళు దిండును తడపనారంభించాయి ! బత్తాయి పండును వలిచి ఆమె చేతిలో పెట్టిన అతను ఆమె ఏడ్పును చూశాడు

' సుమీ ఏడుస్తున్నావా ? ' జాలిగా అడిగాడు తన క్షణికోద్రేకానికి తననే మనసులో తిట్టుకుంటూ!

' ఊహూ ! ' అంది ఆమె

బత్తాయి తొనలు ఆమె నోటికి అందించి, మెల్లగా చేతిని నిమురుతూ — ' నేను వట్టి తొందర మనిషిని — నీకు తెల్సుగా — నీవు ఏడ్చి నన్ను ఏడిపించబోకు నాకు ఇహ ఏడవటానికి గూడా వోపిక లేదు ' అన్నాడు

అంత వ్యాధిలోనూ, ఆమె కండ్లలో ఆమాటతో దీపాలు వెలిగాయి 'నా మీద మీకెంత ప్రేమ!' అన్నట్టుగా బలహీనంగా అతని చేతిని నొక్కింది — ఇప్పుడు ఆ చేతి స్పర్శలో ఇంతకు ముందు అతను అనుభవించిన ఆ సుఖం లేదు ఆ అనుభూతి లేదు !

' నాన్నా ! ' ప్రక్క గదిలోంచి — నిద్రలో పిల్చినట్టుగా కుర్రవాడి అరుపు ! నిద్ర పట్టించుకోటానికి ప్రయత్నం చేస్తున్న భార్య మూలుగు ! ' రాత్రి 'కి కావలా కాస్తున్న అతను లేచాడు — ' సుమీ బాబు లేచాడు అక్కడకు వెళ్లనా ? ' ఆమె దిండును సర్దుతూ చెవిలో నోరుంచి అడిగాడు

వెళ్లమన్నట్టుగా ఆమె సైగ !

ప్రక్క గదిలోకి వెళ్ళి — మంచం పక్కమీద కూర్చుని నిద్రలో కలవరిస్తున్న ' బాబు ' జుట్టును నిమురుతూ — ' ఏమిటి బాబూ ? ' అన్నాడు. బాబు నిద్ర పోతన్నట్టుంది జవాబివ్వలేదు కొన్ని ఏండ్లనుంచి నిద్ర లేనట్టుగా అతని కండ్లు మండుతున్నాయి బరువుగా కనురెప్పల మూతలు పడుతున్నాయి బాబును ప్రక్కకు జరిపి ముడుచుకుందామనుకున్నాడు

మత్తు — ప్రపంచంలో వున్న మత్తు అంతా తనను ఆవరించినట్లనిపించింది కానీ నిద్రపోతే ఎలాగా ? సుమిత్రకు పదిన్నరకు మళ్లీ మందివ్వాలి! పదకొండుకు ' క్యాప్సిల్స్ ' ఇవ్వాలి — అటు తరువాత ఒంటిగంటకు పండ్ల రసం —యాంత్రికంగా జీవితం నడుస్తున్నది యంత్రం అయినా అతిగా పని చేసినట్లు అనిపిస్తే మరి పని చేయనంటుందేమో . కానీ జీవితం ? శాశ్వతంగా మూలన పడేంతవరకూ యాంత్రికంగా నడవక తప్పదు

వస్తున్న నిద్రను ఆపుకోటానికి సుందరం ముఖాన్ని చల్లటి నీళ్లతో కడుక్కుని — ఫ్లాస్కులో వుంచుకున్న కాఫీ త్రాగాడు గడియారం వైపు చూసుకున్నాడు పది — అయిదు ! డాక్టర్‌కు ఇవ్వాళ ఎందుకనో ఆలస్యం అయివుంటుంది — అందుకనే టంచనుగా వచ్చే డాక్టరు రాలేదు

నిద్రను దూరం చేయటానికి సిగిరెట్టును ముట్టించాడు సిగిరెట్టు పొగలా దట్టంగా ఆలోచనలు ! ఆలోచనల్లాగా సిగిరెట్టు పొగ ఉంగరాలు తిరిగి కిటికీలోంచి బయటకు మాయమవుతున్నది

వెనుకటి సంఘటనలు పొగలాగ ఉంగరాలు తిరగసాగాయి !

గతం ముందుకు వచ్చింది !

నడుస్తున్న కాలచక్రం వెనక్కి తిరిగింది !

* * *

' సుమీ ! నీవెంత బాగున్నావో తెల్సా ? '

— ' ఇదిగో బాబూ ! మీరిలా పొగడటం మొదలెస్తే నేను పారిపోతాను '

పారిపోయినా సరే — నిన్ను నా ప్రేమ పాశాలు వేసి లాక్కుని రానూ ? ' — గలగలమని ఆమె నవ్వు గుండెల్లో గంటలు మ్రోగినట్టుగా— హృదయంలో పన్నీరుజల్లు చల్లినట్టుగా

' సుమీ ! ' తన్మయత్వంతో అతను.

' ఊఁ ! ' మత్తుగా ఆమె

' నిన్ను గుండెల్లో దాచుకుంటాను — హృదయంలో పొదువుకుంటాను '

' ఇంతేనా ? '

' అంతేకాదు నిన్ను పెండ్లి చేసుకొని ఎల్లప్పుడూ నాదాన్నిగా చేసుకుంటాను '

' మీ నాన్న ఒప్పుకోరని నా భయం ' బాధగా ధ్వనించిన ఆమె కంఠం

' ఇదిగో అమ్మాయి ! పెద్దవాళ్లు మన పేర్ల కాంబినేషన్ చూస్తైనాసరే మనకు పెండ్లి చేయక తప్పదు సుమిత్రా సుందరం "

ఆ సంఘటన చల్లని పిల్ల తెమ్మెర కమ్మని కల !

* * *

' ఏమండీ ? ' సుమిత్ర మూలిగింది

' సుఖం ' అనేది చాలాకొద్దిసేపు మాత్రమే లనుభవించటానికి వీలుగా వుండటం వల్ల కాబోలు — దాన్ని సుఖం అన్నారు భూతకాలంలోకి రెక్కలు గట్టుకొని ఎగిరిన అతను వర్తమానంలోకి ఆపిలుపుతో వచ్చాడు భవిష్యత్తు భయంకరంగా వెక్కిరిస్తుంటే!

' ఏమిటి ? ' అన్నాడు విసుగు ధ్వనించకుండా సాధ్యమైనంత వరకూ కంఠాన్ని అదుపులో పెట్టుకుంటూ

' ఇలా దగ్గరకు రండి ' నిస్సత్తువుగా ఆమె అన్నది

మెల్లగా లేచి ఆమె దగ్గరకు వెళ్లి ప్రక్కనే కూర్చున్నాడు

' ఇవ్వాళ కొంచెం దగ్గు తగ్గింది కదూ ? ' ఆశగా అడిగింది

'ఊఁ ! ' అన్నాడు నిర్జీవంగా సుందరం.

"పాపిష్ఠిదాన్ని మిమ్మల్ని కష్టపెడుతున్నాను .. ఈ రెండు నెలల్లో ఎంతగా చిక్కిపోయారు. బక్కచిక్కిన తన చేతిని అతని వీపుమీద వేసి నిమురుతూ అంది

' సుమీ ! నీవు మాట్లాడబోకు డాక్టరు మాట్లాడితే శరీరానికి అలసట కలుగుతుందని చెప్పలే ? '

" రెండురోజుల్నుంచి కొంచెం బాగుంది వంట్లో.. దగ్గు అతిగా రావటం లేదు "

' అబ్బబ్బ ! నీవు చెబుతే వినవ్ ! నాకు అనవసరంగా కోపం తెప్పిస్తావ్ అతిగా వాగి " ఆమెతనను అదుపులో వుంచుకోవటానికి కాబోలు వోర్పుగా కండ్లు మూసుకుంది తనను ఈ విధంగా కట్టడిలో పెట్టున్నందుకు నిరసనగా — అతని వీపుమీద వేసిన చేయి తీసి వేసింది.

— అర్థం చేసుకున్నాడు ' సుమీ ! ' అని పిల్చాడు

ఆమె పలకలేదు మీదికి వంగి — ' నీవు మాట్లాడితే నాకు సంతోషం గాదా చెప్పు ? ఇదివరకటిలా నీవు సంతోషంగా కళకళ లాడుతూ తిరిగేందుకేగా నాయీ శ్రమంతా నీ చక్కని నవ్వుతో— కొన్నేళ్ల నుంచి శోకంతో నిండిన ఈ ఇంటిని మళ్లీ పువ్వుల మయం చేస్తావనేగా నాఆశ ! కొద్ది రోజులు వోపిక పడ్తే చాలు ఇదివరకటిలా హాయిగా " అన్నాడు గడిచి పోయిన కొద్ది సుఖాన్ని జ్ఞప్తికి తెచ్చి ఆమెకువూరట కల్పించాలని అతని సంకల్పం — అనుభవించిన ఆకొద్ది సుఖమూ ఇప్పుడు అందని పండు ! మళ్లీ రాదేమోనని భయం ! భవిష్యత్తే ఏ ప్రశ్నార్థపు గుర్తుతో భయంకరంగా నిల్చుంది. వర్తమానం గబగబా గడుస్తే బాగు — లోతుగా — జాడ తెలియనంత లోతుగా వున్న అగాధపు భవిష్యత్తుతో తన జీవితం ఎలా ముడిపడి వున్నది, తెల్సుకోవచ్చు !

అతని మాటలు ఆమె చెవులకు మధురంగా వినిపించాయి కాబోలు బ్రతుకు మీద ' ఆశ 'ను పెంచుకుంటున్న ఆమెను క్రమక్రమంగా నిద్రా దేవత తనలో ఇముడ్చుకుంది

టిక్కు టిక్కున గోడ గడియారం చప్పుడు మెల్లగా జారిపోతున్న కాలం మళ్లీ ముసురుకుంటున్న ఆలోచనలబారు గడిచి పోయిన జీవితాన్ని గురించి పదేపదే పర్యాయవలోకనం చేయటానికి అలవాటుపడ్డ అతని మెదడులో సంచలనం

క్రమంగా గతంలోకి అతను జారి పొయ్యాడు.

* * *

నీవు సుమిత్రను పెండ్లి చేసుకోటానికి వీల్లేదు ' ఆరోజు — తను సుమిత్రను పెండ్లి చేసుకుంటానని అడిగిన రోజు నాన్న కోపంతో వణికి పోతూ ఆమాట అన్నాడు

' కోపా'నికి పర్యాయపదం నాన్న ! అంత ధైర్యం అంతకు ముందెన్నడూ నాన్న ముందు తను ప్రదర్శించ లేదు — అదే మొదటిసారి — చివరిసారి గూడా !

' జీవితంలో నాకు పెండ్లి అనేది వుంటె ఆ అమ్మాయితోనే నాన్నా ! ' తన జవాబుకు ఇంట్లో వాళ్ళందరూ వణికిపోయారు అమ్మ ఆశ్చర్యపోయింది ! ' నాన్న బిస్కెట్లు పెడ్తారు తెచ్చుకోరా ! ' అంటే ' అమ్మో — నాకు భయం ! నీవే తెచ్చివ్వు ' అని చిన్నతనంలో అన్న సుందరం వీడేనా ? అని కండ్లు నులుముకొని మరీ చూసింది — ఒక్కొకప్పుడు అతి పిరికివాడే మరీ మొండి ధైర్యస్థుడిగా మారిపోతాడన్న సంగతి పాపం అమ్మకు తెలియదు ! నాన్న కోపం హెచ్చయింది ఆ జవాబుతో !

మూడు పువ్వులు ఆరు కాయలతో సుఖంగా కొడుకు జీవితం గడిచిపోతుందనుకున్న అంచనా తప్పినందుకు కాబోలు ! — తనని పొదివి పట్టుకొని ' నాన్నా ! నామాట విను బాబూ ! ' అని అన్నాడు

నాన్న తనను ' నాన్నా ! ' అని చాలా తక్కువసార్లు పిల్చేవాడు తను పదేండ్ల కుర్రాడుగా వున్నప్పుడు — చెరువులో ఈత లాడటానికి వెళ్ళి ప్రమాదవశాత్తు మడి గుండంలో చిక్కుకొని — అదృష్టవశాత్తు బయటపడిన రోజు, నాన్న తడిసి వణుకుతున్న తనను

# ఓడిపోయినమానవుడు

దగ్గరకు తీసుకొని — ' నాన్నా ! బ్రతికావు గదా అంతే చాలు ! ' అన్నాడు నుదుటిమీద ముద్దు పెట్టుకుంటూ లెక్క పెట్టటానికి వీలున్నన్ని తక్కువ సార్లు ఆయన ' నాన్నా ! ' అని పిల్చేవాడు

తన మీదున్న ప్రేమకు ప్రాణం పోసేది ఆపిలుపు ఆ పలుకు తనకు అమృతప్రాయంలా వుండేది !

— కానీ ఆరోజు తను కరగలేదు తన గుండె చెదర లేదు మాట మారలేదు ! కన్న కడుపు కోసం నాన్న కరగక తప్పలేదు లోకం అంతా కోడై కూస్తున్నప్పటికిని, కొడుకు సుఖం కోసం, తక్కువ కులపు అమ్మాయితో పెండ్లి చేయటానికి అంగీకరించాడు — సుమిత్రకు తను చేసిన బాసలు అడియాసలవకుండా నిజంగా కారణభూతుడైన నాన్న ఒక విధంగా కుటుంబపు భవిష్యత్తును గూడా లెక్క చేయలేదు — తన కోసం — కేవలం తన కోసం — కుటుంబాన్ని బలి ఇచ్చాడు !

చెల్లెలు రాధ పెండ్లికోసం కాలికి బలపాలు కట్టుకొని తిరిగి — వేసారి — బంధువుల ఛీత్కారాన్నీ — ఈసడింపునూ కడుపులో దాచుకొని నాన్న నిరాశతో వెనక్కి తిరిగి వచ్చినప్పుడు తను ఏం జవాబు చెప్పాడు ?

' రాధ 'కు పెండ్లి కాలేదని అమ్మ దిగులుతో కృంగి కృశించి మంచం పట్టి చివరకు తీరని కోరికను మాత్రం మిగుల్చుకొని శాశ్వతంగా ఈ లోకంతో బంధాలు తెంచివేసుకున్నప్పుడు — తను — గుండె బ్రద్దలయ్యేలా ఏడవటం తప్ప ఏం చేశాడు ?

' కోరికలు ' భయంకరంగా దహించేస్తుంటే — అదుపులో పెట్టుకోలేక శాశ్వతంగా మచ్చను మాత్రం మిగిల్చి — రాధ మలినమై, జాడ తెలియకుండా వెళ్ళిపోయినప్పుడు, తను సిగ్గుతో తలవంచుకోవటం తప్ప ఏం చేస్తాడు ?

కొడకు చేసిన 'సాహసం' ఇన్ని అనర్థాలకు దారి తీస్తుందని తెలియని నాన్న పిచ్చెక్కి దేశాల మీద పడ్డప్పుడు — తనకు ఏరి, కోరి చేసుకున్న సుమిత్ర ఎదురుదెబ్బలు తింటూ, కష్టాల కెరటాలను పీల్చుకుంటూ — గడవబోతున్న జీవితం మీద ఆశలు పెంచుకుంటూ — చేరువులో వున్న దరికి చేర బోతున్న సమయంలో మళ్ళీ ఇంకో పెద్ద కెరటం !...

.. సుమిత్రకు క్షయ !

* * *

బయట సవ్వడి — జరిగి పోయిన జీవితపు ' రివ్యూ 'ను మూసి వేసింది డాక్టరు వచ్చాడు !

' ఇవ్వాళ కొంచెం అలస్యమయింది సుమిత్రకు నిద్ర పట్టిందా ? ' అడిగాడు సుందరం తలూపి ఆయన్ను అనుసరించాడు

సుమిత్ర ఉఛ్వాస నిశ్వాసాలతో గది నిండి పోయింది డాక్టర్ సవ్వడికి ఆమె లేవలేదు సుఖంగా నిద్ర పోతున్నది !

' నిన్నటినుంచి కొంచెం ఉధృతం తగ్గింది ' — సుందరం చెప్పాడు డాక్టర్ ఆమెను పరీక్షించాడు — సిరంజీలోకి మందు ఎక్కించి ఇంజక్షన్ ఇచ్చాడు — బాధతో కొద్దిగా కదిలి డాక్టర్‌ను చూసింది సుమిత్ర!

' ఏలాగుందమ్మా ? ' ఆయన ఆప్యాయత నిండిన కంఠంతో అడిగాడు డాక్టర్లకు వోర్పు వెన్నతో బెట్టిన విద్య కాబోలు !

' కొంచెం దగ్గు తగ్గింది ' ఆయాస పడుతూ చెప్పింది సుందరం — ' చెప్పింది చాలు ! ఇహ మాట్లాడొద్దు అన్నట్లుగా సైగ చేశాడు

— ఇద్దరూ గదిలోంచి బయటకు వచ్చారు.

' సుందరం ! మీరు చాలా శ్రమపడుతున్నారు ' డాక్టర్ కంఠంలో మెచ్చుకోలు ధ్వనించింది

' ఎవరి కోసం ? ' పేలవంగా నవ్వి ప్రశ్నించాడు డాక్టరు సుందరం

' ప్రమాదం రెండు రోజుల్నుంచి తగ్గు ముఖం పట్టింది — సుమిత్ర తప్పకుండా బ్రతుకుతుందనే నమ్మకముంది '

' కృతజ్ఞుడ్ని డాక్టర్ ! రోజు రోజుకూ నిరాశను పెంచుకుంటున్న నాకు మీ మాటలతో ఎందుకనో ధైర్యం కలుగుతున్నది, — గొణిగినట్లుగా అన్నాడు సుందరం

' గుడ్‌నైట్ — ' డాక్టర్ వెళ్ళిపోయాడు


— తలుపు గడియ వేసి సుందరం లోపలికి వచ్చాడు సుమిత్ర చప్పుడుకు ప్రక్కకు తిరిగింది ప్రక్కనే కూర్చుంటూ ఎండిపోయిన ఆమె జుట్టులోకి వేళ్ళ దూర్చి — ' ఫర్వాలేదు సుమీ నీకు నయమవుతుంది ' అన్నాడు


ఆమె పొడి దగ్గును కొంచెం అణుచుకొని — 'వూ ! ' అంది ఆశగా


' డాక్టరు చెప్పాడు '


' మీరు నాకోసం ' తను మాట్లాడుతుంటే, సుందరం ముఖంలో ప్రస్ఫుటించిన విసుగును కనిపెట్టి, ఆమె ఇహ మాట్లాడలేదు

సుందరం మెల్లగా లేచి వాలు కుర్చీలో కూర్చొని






# ఓడిపోయిన మానవుడు

గడియారం వైపు చూశాడు ఒంటి గంటకు అయిదు నిముషాలు తక్కువ

అలసటగా కండ్లు మూసుకొని డాక్టర్ అన్న మాటలను తిరిగి జ్ఞప్తికి తెచ్చుకోసాగాడు

ఎందుకనో మనసులో అకస్మాత్తుగా ఉదయించిన తృప్తి రేఖ! తన శ్రమకు ఫలితం లభిస్తే చాలు! భగవంతుడు తన పాలిట చాలా నిర్దయగా ప్రవర్తిస్తున్నాడు కుటుంబాన్ని సహితం పణంగా ఒడ్డిన తను 'సుమిత్ర తను బ్రతికించుకో గలడనే పిచ్చి ధైర్యంతో విధికి ఎదురీటం లేదుకదా ?— ఆమె తనకు కావాలి! ఆమెను తను మిగుల్చుకోవాలి!

డాక్టర్ స్వాంత వచనాలతో అతని హృదయంలో సుమిత్ర తప్పకుండా బ్రతుకుతుందనే పిచ్చినమ్మకం! 'కష్టాలు కలకాలం ఉండవనే' సూక్తి జ్ఞాపకానికి వచ్చి మనసులో మెదలిన ధైర్యం ఆశా— నిరాశల మధ్య కొట్టు మిట్టాడుతున్న మస్తిష్కం!

సుమిత్రకు శరీరం నిండా దుప్పటికప్పి, పక్క మీదకు చేరి సిగరెట్టు ముట్టించాడు —అలసటలో నిండిన దగ్గు అతని గుండెల్లోంచి ఉబికి వచ్చింది.

అలసటగా తెల్లవారింది ఆ రాత్రి.

* * *

దాదాపు ఇంకో నెల రోజులు అలాగే తెల్లవారాయి— దిగులుగా, బరువుగా— క్రమక్రమంగా విచ్చుకుంటున్న ఆశ— పెద్దదిగా, మరింత పెద్దదిగా అప్పుడప్పుడూ, ముందు ఏమవుతుందో దేమోనని మనసులో తొంగి చూసే భయం ఇంజక్షన్లు, మదులు — జబ్బు . సుమిత్ర . పాలిపోయిన సుమిత్ర చెక్కిళ్లల్లోకి కొత్త నెత్తురు కన్నులలో వింతకాంతి సుందరం సుమిత్ర బ్రతికింది!

కంటి మీద కునుకు లేకుండా అతను పడిన శ్రమ ఫలించింది

—నవ్వుల పువ్వులు ఇంటినిండా విరజిమ్ముతూ మళ్లీ సుమిత్ర తిరగటం మొదలెట్టింది.. ఇప్పుడు ఆమెది పుంజుకుంటున్న అందం— కోలుకుంటున్న ఆరోగ్యం— దిగులుగా దిగులు ఆ ఇంట్లోంచి బయటికి పోదామా, వద్దా అని ఆలోచిస్తున్న సమయం కొత్త నెత్తురు కొత్త ప్రపంచం సుందరానికి చిగురించిన కొత్త ఆశ!

—బిల్లు చెల్లిస్తూ అన్నాడు డాక్టరుతో

'కృతజ్ఞుడ్ని డాక్టర్! సుమిత్ర బ్రతకదనుకున్నాను ఈ పాడు లోకానికి దూరంగా — నా నుంచి దూరంగా వెళ్లిపోతుందనుకున్నాను! చీకటితో నిండిపోయిన నా జీవితానికి వెలుతురు లేదనుకున్నాను కానీ కానీ' ఖంగుఖంగున దగ్గు ఉప్పెనలా వచ్చింది మాట పూర్తిగాకుండానే

డాక్టర్ కంగారు పడ్డాడు!

—అతి కష్టం మీద అణచుకొని. నిస్సహాయంగా డాక్టర్ని చూసాడు

—యాంత్రికంగా సుందరాన్ని పరీక్షించిన నివ్వెర పోయాడు డాక్టర్

'ఏమిటి డాక్టర్ ?' . బలహీనంగా అడిగాడు సుందరం

'సారీ! మీకు క్షయ!' డాక్టరు నెమ్మదిగా... సాధ్యమైనంత నెమ్మదిగా అన్నాడు! ★